ప్రజాశక్తి

గురువారం 12 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

'జగనన్న' పోరుబాట కార్యక్రమానికి పోటెత్తిన జనం, ఇన్‌సెట్లో జగన్‌కు స్వాగతం పలుకుతున్న బూచేపల్లి

రాజకీయ రణరంగం

- 'జగన్ కాన్వాయ్' లో రాళ్ల రాడులు.. • రాజకీయ రాద్ధాంతాలు
- మీరంటే మీరంటూ వైసిపి, తెలుగుదేశం నేతల ఆరోపణలు
- జగన్ పర్యటనతో మరోసారి రెండు పార్టీల నడుమ ప్రచ్ఛన్న యుద్ధం

2లో

రాళ్లదాడిలో గాయపడ్డ కానిస్టేబుల్

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఏరువాక పౌర్ణమి రైతు సదస్సులో శోభనాద్రీశ్వరరావు

3లో

రైతులకు అండగా ప్రభుత్వం

ఏరువాక కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్

8లో

పొలం దున్నుతున్న ముత్తుముల కృష్ణ కిశోర్‌రెడ్డి

ఘనంగా 'ఏరువాక పౌర్ణమి'

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సాగుకు సమాయత్తం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పొల్గొని ఎడ్ల కాడిని పూజించారు. గుంటక గొర్రుతో సేద్యం చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, తెలుగు రైతు నాయకులు మార్తాల సుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్, మండల వ్యవసాయాధికారులు విజయ భాస్కర్ రెడ్డి, అబ్దుల్ రఫీక్,రాజశ్రీ, మెర్సీ, మహబూబ్ బాషా, రైతు నాయకులు నంది శ్రీను, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **మద్దిపాడు :** నవధాన్యాల సాగుతో పొగాకు నాణ్యత పెరుగుతుందని వెల్లంపల్లి పొగాకు బోర్డు సూపరింటెండెంట్ రామకష్ణ తెలిపారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పొగాకు బోర్డు ద్వారా నవధాన్యాలను రైతు పల్లకి సత్యనారాయణ రెడ్డి పొలంలో చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు బోర్డు గోల్డెన్ జూబ్లీలో భాగంగా నవధాన్యాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి శ్రీహర్ష, ఐటీసీ కంపెనీ ప్రతినిధులు జస్వంత్, శరత్, రైతు పల్లకి సత్యనారాయణ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు. **తాళ్లూరు :** తాళ్లూరు మండలం తూర్పుగంగవరం రైతు క్షేత్రాలో ఏరువాక పూర్ణిమ సందర్భంగా ఎద్దులతో దుక్కి దున్నే కార్యక్రమం బుధవారం చేపట్టినట్లు ఎఒ బి.ప్రసాదరావు తెలిపారు. మేలో మండలంలో 154.9 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌ఛార్జి పి.నరసింహులు, ఐసిఆర్‌ఎ కోటిరత్నం పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయంలో పీడీ తనిఖీ

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

గిద్దలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సువర్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సిబ్బంది వివరాలు, రికార్డులు పరిశీలించారు.సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. సిబ్బంది టైం టు టైం తమ విధులు నిర్వర్తించాలని, నూరు శాతం రిపోర్ట్స్ స్టేటస్ లో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిడిపిఒ బి.జ్యోతి , ఐసిడిఎస్ సూపర్ వైజర్ వసంతకుమారి, సీనియర్ అసిస్టెంట్ జాకీర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'తల్లికి వందనం' : గొట్టిపాటి

ప్రజాశక్తి-దర్శి

సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మరో ముఖ్యమైన హామీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. నేడు తల్లికి వందనం నిధుల విడుదలకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద గురువారం వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేస్తారని పేర్కొన్నారు. ఒకటవ తరగతిలో అడ్మిషన్లు పొందే పిల్లలు ఇంటర్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు చేస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ఖరారు. చేస్తూ జీవో విడుదల చేయడం అభినందనీయమన్నారు.

'ఒంగోలు'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు బుధవారం నిర్వహించారు. తొలుత ఒంగోలు నగరంలోని 17వ డివిజన్ సంఘమిత్ర బైపాస్ వద్ద రూ.7 లక్షలతో నిర్మించిన ఫైబర్ విగ్రహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఒంగోలు నగరంలోని 7వ డివిజన్ కొత్తపట్నం బస్టాండ్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు.కొత్తపట్నం బస్టాండ్ వద్ద శ్రీరాజరాజేశ్వరి శివాలయం దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా

ఫైబర్ విగ్రహాన్ని ఆవిష్కరణలో మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్ధన్

పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.ఒంగోలు నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి డివిజన్‌లో సిసి రోడ్లు, మురుగునీటి కాల్వలు, డివైడర్లు, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న కాలంలో ఒంగోలు నియోజకవర్గంతో పాటు ఒంగోలు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీనివాసరావు, సంద్రపాటి వర్ద్దవర్త్, బోడపాటి వెంకట్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆరోగ్య మందిర్' ప్రారంభం

ప్రజాశక్తి -చీమకుర్తి

స్థానిక పిడతల పూడి రోడ్డులో ఏర్పాటు చేసిన అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రభుత్వ వైద్యశాలను మద్దిపాడు ఎఎంసి చైర్మన్ మన్నం రాజ్యలక్ష్మి ప్రసాద్ బుధవారం ప్రారంభించారు.

ఆరోగ్య మందిర్‌ను ప్రారంభిస్తున్న రాజ్యలక్ష్మి ప్రసాద్

ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మలక బేబీ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి ద్వారా జనరల్ వైద్య సేవలు, బిపి, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, కాంటినెంటల్ చెక్ అప్స్, గైనకాలజిస్ట్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆసుపత్రి పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యడ్లపల్లి రాంబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధర్ రావు, గొల్లపూడి సుబ్బారావు, పూనాటి వెంకట్రావు, రావిపాటి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారాను నిర్మూలించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సారా నిర్మూలించడానికి జిల్లా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ , ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో నవోదయం 2.0, నాటు సారా నిర్మూలనపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీ ప్రాంతాలు గురించి, దాని నిర్మూలనకు తీసుకున్న చర్యలు గురించి రాహుల్ దేవ్ శర్మ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కె. హేమంత నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎం.సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దయాసాగర్, బాపట్ల జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ జనార్ధన్‌రావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాహుల్ దేవ్ శర్మ

రాజకీయ రణరంగం..!

- 'జగన్ కాన్వాయ్' లో రాళ్ల రాడులు..
- రాజకీయ రాద్ధాంతాలు
- మీరంటే మీరంటూ వైసిపి, తెలుగుదేశం నేతల ఆరోపణలు
- జగన్ పర్యటనతో మరోసారి రెండు పార్టీల నడుమ ప్రచ్ఛన్న యుద్ధం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి అధినేత జగన్ కాన్వాయ్‌లో రాళ్లు, చెప్పుల దాడులు జరిగాయి. జగన్ హెలికాప్టర్ దిగి రోడ్డు మార్గాన వేలం కేంద్రానికి చేరుకునే సమయంలో ఒక సారి.. ఆయన తిరిగివెళ్లే క్రమంలో మరోసారి ర్యాలీలో రాళ్లు, చెప్పులతో దాడి జరిగింది. రోడ్డుపై ఉన్న జనంపై పడ్డాయి. ఎవరు వేశారు? ఎందుకు వేశారన్నది తేలాల్సి ఉంది. పోలీసులు విచారణ జరిపి.. దాడులు చేసిన వారిని గుర్తించాల్సి ఉంది. ఈ దాడుల్లో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులకూ దెబ్బలు తగిలాయి. జగన్ రాక సందర్భంగా తెలుగుదేశం మహిళలు అమరావతిపై చేసిన వ్యాఖ్యలకు జగన్ క్షమాపణ చెప్పాలని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయన వచ్చే దారిలోనే పలు చోట్ల తెలుగు మహిళలు నల్ల బెలూన్లు ఎగురవేశారు. ఈ కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. రాళ్లు, చెప్పులతో దాడికి కారణమైంది. ఎవరు వేశారనే దానిపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో రాజకీయంగా రెండు పార్టీల నేతల మధ్య వాతారణం వేడెక్కింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఈ సంఘటన రాజకీయంగా రాద్ధాంతానికి దారితీసింది. పొదిలిలో కాసేపు ఉద్రిక్తత పరిస్థితులకు తావిచ్చింది. పోలీసు వర్గాల్లోనూ ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఘటన జరిగిన వెంటనే మంత్రి నారా లోకేష్ వైసిపి నేతలే తమ మహిళా కార్యకర్తలపై రాళ్లు వేశారని అమరావతిలో వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. వెంటనే వైసిపి నేతలూ స్పందించారు. పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒంగోలులో పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం పెట్టి.. టిడిపి నేతలపై ఆరోపణలు చేశారు.తాము శాంతియుతంగా రైతుల సమస్యలపై కార్యక్రమం పెడితే ఇదే రోజున టిడిపి నేతలు మహిళల ముసుగులో కార్యక్రమాన్ని పక్కదారి పట్టించేందుకు కుట్రతో వ్యవహరించారన్నారు. వాళ్లే రాళ్లు వేసి తమపై బురద జల్లుతున్నారన్నారు. పోలీసులకూ చెప్పామన్నారు. కావాలనే తమ కార్యక్రమాన్ని పక్కదారి పట్టించే దురుద్దేశంతోనే ఇలా చేశారని ఆరోపించారు. మార్కాపురం ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు కూడా దీనిపై స్పందించి మాట్లాడారు. నియోజకవర్గంలో రాత్రుళ్లు మీటింగు పెట్టి కావాలనే రెచ్చగొట్టింది ఎవరో తెలియదా? అని ప్రశ్నించారు. తమ కార్యక్రమం రోజునే నిరసనల పేరుతో రైతుల సమస్యను పక్కదారి పట్టించే యత్నం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వస్తున్నప్పుడు.. వేలాది మంది కార్యకర్తలు, జనం వస్తున్నపుడు పోటీగా నిరసనలు పెట్టడం ఏమిటన్నారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటే తమకు ఏమీ అభ్యంతరం లేదన్నారు. ఏదేమైనా ఈ ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. వైఎస్.జగన్ ఎందుకు వచ్చారు? ఏమి మాట్లాడారనే అంశం కన్నా కాసేపు దీనికే ప్రాధాన్యత ఇచ్చారు. ఇదంతా వ్యూహాత్మకంగానే జరిగిందని వైసిపి నేతలు భావిస్తున్నారు.

మహారాజశ్రీ ఒంగోలు 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం. 331/2021

జూటూరి శివ కుమార్ ...వాది

మరియు

జి.(గుమ్మడి) రఘునాథ్ ...ప్రతివాది

టు :
జి.(గుమ్మడి) రఘునాథ్,
తండ్రి వెంకటేశ్వర్లు,
హిందువు, వయస్సు 45 సం॥లు,
డోరు నెం.7-5-96, నిర్మల్ నగర్,
ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.

పైనంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను నోటీసులు తీసుకోనందున మీకు నోటీసులు జారీచేయు నిమిత్తముతేది:25-06-2025కు వాయిదా వేసి మీకు నోటీసును పేపర్ ప్రకటన ద్వారా తెలియపరచవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా తేదీన ఉదయం 10:30 ని॥లకు పై తెలిపిన కోర్టులో స్వయముగా గానీ, లేదా ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియపరచుకొనవలసినది, లేని యెడల మీ పరోక్షమున దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది : 11-06-2025. ఇట్లు

పొదిలి శ్రీనివాసులు,
న్యాయవాది,
రూం నెం.11, ఎ-బ్లాక్,
న్యాయవాది సదన్,
జిల్లా కోర్టు ప్రాంగణం,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.
సెల్ : 9440660695.

ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025

చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే విజయకుమార్

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి బస్‌పాస్‌లు తీసుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

బస్ పాస్‌లు ఇవ్వడానికి కొత్తగా సాఫ్ట్‌వేర్ డౌన్లోడ్ చేస్తున్నందున కనిగిరి బస్టాండ్‌లో 12, 13 తేదీలలో బస్‌పాస్‌లు ఇవ్వబడవని డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం బుధవారం తెలిపారు. విద్యార్థులకు 14వ తేది నుంచి బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యా సంస్థలు గమనించి, శనివారం నుంచి బస్ పాసులు తీసుకోవాలని సూచించారు.

వేణుగోపాల స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-పామూరు

మదన వేణుగోపాల స్వామి ఊరేగింపు సందర్భంగా బుధవారం పామూరు పట్టణంలో మహిళా భక్తులు రథం లాగుతూ ఊరేగింపు నిర్వహించారు. దేవస్థానం నుంచి కనిగిరి రోడ్డు, నెల్లూరు రోడ్డు, సీఎస్‌పురం రోడ్డు మీదుగా రథం ఊరేగింపు జరిగింది. బాలికలతో కోలాటాలు పండరబజనులు వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

దోమల నివారణకు సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.హరిణి పర్యవేక్షణలో సిబ్బంది చర్యలు చేపట్టారు. స్థానిక రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, బిసి హాస్టల్, ఎస్సీ హాస్టళ్లలోని అన్ని తరగతి గదుల్లో దోమల నివారణ మందులు చల్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డి మధుసూదనరావు మాట్లాడుతూ దోమ కాటు వలన డెంగ్యూ, మలేరియా బోదకాలు వ్యాధి, చికెన్ గునియా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్‌ఓ ఆర్.ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ బి.కృష్ణ, సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, ఫీల్డ్ వర్కర్ ఏ.సుధాకర్, స్టాఫ్ నర్స్ అన్నపూర్ణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్ సుజాత పాల్గొన్నారు.

తహశీల్దార్ ఆదిలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మిని బుధవారం వీఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. పది నెలల పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ తహశీల్దార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎస్కే మాబు సుభాని, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలపై వైసిపి రాళ్లదాడి హేయం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

గాయపడిన కానిస్టేబుల్‌కు పరామర్శ

కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-పొదిలి

రాజధాని మహిళలపై సాక్షి యాజమాన్యం రిపోర్టర్లు వేశ్యలని చేసిన వ్యాఖ్యలపై పొదిలి పట్టణంలో నల్ల బెలూన్లు, ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలపై వైసిపి మూకలు రాళ్ల దాడి చేయడం హేయమైన చర్య అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాళ్లదాడిలో గాయపడిన కానిస్టేబుల్ రత్నం, ఇద్దరు మహిళలు మరో వ్యక్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి మూకలు కాన్వాయ్‌లో ముందస్తు ప్లాన్ ప్రకారం కర్రలు, రాళ్ళు, చెప్పులతో వచ్చి ఒక్కసారిగా రాళ్లు చెప్పులతో దాడి చేశారన్నారు. ఈ ఘటనతో ఒకసారిగా నివ్వెరపోయిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి తరిమి కొట్టారన్నారు. ఈ సందర్భంగా నలుగురు మహిళలకు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వారిని వెంటనే పొదిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారని అందులో తీవ్రంగా గాయపడిన మరొకరిని ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారన్నారు. పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వచ్చిన జగన్ రెడ్డి తూతూ మంత్రంగా రైతులను పరామర్శించారని విమర్శించారు. జగన్ పర్యటన అనంతరం రైతులు మాట్లాడుతూ ఆయన వచ్చిన తరువాత పొగాకు కొనుగోళ్లలో ఏటువంటి మార్పు లేదని తెలిపారన్నారు.

మోగిన బడి గంట

ప్రజాశక్తి-దర్శి

నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. దర్శి మండలంలో గత ఏడాది తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉంటే నాలుగు పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో ఏడాది నూతనంగా నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొత్తగా రావడంతో మొత్తం 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు దర్శి మండలంలో కొనసాగనున్నాయి. గత ఏడాది మొత్తం 85 పాఠశాలలు ఉండగా నేడు పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడంతో 89కి పెరిగినట్లు మండల విద్యాశాఖ అధికారులు కాకర్ల రఘురామయ్య, బి.రమాదేవిలు తెలిపారు. మండలంలో గతంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలకు అనుబంధంగా తూర్పు వీరాయపాలెం, శేషంవారిపాలెం, బండి వెలిగండ్ల, త్రిపుర సుందరీపురం పాఠశాలలో పెరిగినట్లు వారు తెలిపారు. మొత్తం ప్రాథమిక పాఠశాలలు 71, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 13, గురుకుల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, ట్రైబల్ వెల్ఫేర్ స్కూలుతోపాటు కృష్ణాపురంలోని ఎయిడెడ్ పాఠశాలతో కలిపి 89 పాఠశాలలు మండలంలో ఉన్నట్లువారు తెలిపారు. ఏడాది అందరికీ తల్లికి వందనం కింద తల్లుల ఖాతాలో విద్యార్థికి రూ.15 వేలు నేడు జమ చేయడం జరుగుతుందన్నారు. దీనితో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుకునే పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించి మంచి ఉపాధ్యాయులతో విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలతో సమాజం అభివృద్ధి

బెతూన్ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ ఉదయిని

మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు అందించడం ద్వారా సమాజం వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉంటాయని బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ యస్.ఉదయిని అన్నారు. సంతనూతలపాడులోని సుందరయ్య భవన్లో గత నెల రోజులుగా ఐద్వా ఆధ్వర్యంలో, జన శిక్షణ సంస్థాన్ సహకారంతో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని డాక్టర్ ఎస్. ఉదయిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో తరతరాలుగా ఉన్న మూఢ భావాలు, పితృ స్వామిక భావజాలం మహిళల అభ్యున్నతికి ఆటంకాలుగా ఉన్నాయన్నారు. వాటిని ఛేదించుకుని మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారని ఆమె అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ బెతూన్ నర్సింగ్ హోంలో కీర్తిశేషులు ప్రజా వైద్యులు డాక్టర్ టాన్య ఐద్వా ఉద్యమంలోనూ, ప్రజా వైద్యులుగాను విశేష సేవలు అందించారని అన్నారు. వారి స్ఫూర్తితో డాక్టర్ ఉదయని గర్భిణీ స్త్రీలకు ప్రతినెల మూడవ శుక్రవారం ఉచిత వైద్యాన్ని అందించటంతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేసి అనేక విధాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. మహిళలకు తమ వంతుగా జన శిక్షణ సంస్థాన్ లాంటి సంస్థల సహకారంతో ఇటువంటి శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఐద్వా మండల కార్యదర్శి నేరుసుల మాలతి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ కుట్టు శిక్షణా కేంద్రంలో 40 మంది మహిళలు గత నెల రోజులుగా శిక్షణ పొందుతున్నారని, ఇది పూర్తయ్యాక మరికొన్ని కేంద్రాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు టి అంకమ్మ, టైలరింగ్ టీచర్ సిహెచ్ అనూరాధ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని ఇన్‌ఛార్జి సిడిపిఓ దేవకపావరం తెలిపారు. చంద్రశేఖరపురం, కంభంపాడు గ్రామాలలో అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. తల్లితండ్రులకు అంగన్‌వాడి కేంద్రాల గురించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

కొండపి: అంగన్‌వాడీ బాటలో భాగంగా 3 సంవత్సరాలు నిండిన పిల్లలందరూ బడిలో ఉండాలని సిడిపిఓ సుశీలదేవి అన్నారు. బుధవారం కొండపి, మిట్టపాలెం, వెన్నూరులలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు అంతా బడిలో ఉండాలని, బడి బయట ఉండరాదని అంగన్‌వాడీలో చిన్నారులను చేర్పించాలని సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, తల్లులు, చిన్నారులు, కిశోర్‌బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామూరు: మండల పరిధిలోని డి.వి. పల్లి అంగనవాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.వి.ఎస్. పార్వతి ఆధ్వర్యంలో బుధవారం తల్లిదండ్రులు, పిల్లలతో సమావేశం నిర్వహించారు. మొదటగా ప్రీస్కూలు పిల్లలను వారు పూర్తిచేసిన ప్రాథమిక విద్యను తల్లిదండ్రులు ఎదుట ప్రదర్శించారు. 'గ్రాడ్యుయేషన్ డే' జరిపి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కొత్తగా చేరిన ప్రీస్కూల్ పిల్లలకు "సామూహిక అక్షరాభ్యాసం" కార్యక్రమం నిర్వహించారు. పార్వతి మాట్లాడుతూ అంగనవాడీ అమ్మ వంటిదన్నారు. చిన్నారులందరినీ కేంద్రానికి పంపించాలన్నారు. వీరికి ఆట,పాట, బోధనోపకరణాలతో విద్యాబోధన పద్ధతుల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అంగనవాడి కార్యకర్తలు ఫణి కుమారి, రజియా బేగం, మల్లేశ్వరి, కృష్ణవేణి, ఎలిజబెత్, లక్ష్మీప్రసన్న, సహాయకులు పాల్గొన్నారు.

మిల్లర్‌లో ఇరుక్కొని యువకుడు మృతి

ప్రజాశక్తి-సీఎస్‌పురం

సురేష్ (ఫైల్)

నెల్లూరు జిల్లా సీతారాంపురంలో ప్రైవేటు పాఠశాల భవనానికి స్లాబ్ వేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మిల్లర్‌లో ఇరుక్కొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. సీఎస్‌పురానికి చెందిన బండారు సురేష్ (29) శ్లాబు పనుల్లో భాగంగా సీతారామపురం వెళ్లారు. డీసీఎం వ్యాను– మిల్లర్‌కు మధ్యలో ఉన్న లింకును తొలగించే క్రమంలో అదుపుతప్పి ఒక్కసారిగా మిల్లర్ సురేష్ మీదికి దూసుకెళ్లింది. దీంతో మిల్లర్‌లో ఇరుక్కొని సురేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ మృతి చెందడంతో ఒడియా రాజులనగర్ శోకసంద్రంలో మునిగింది. ఇద్దరు చిన్న బిడ్డలను ఎలా పోషించాలంటూ మృతుడి భార్య రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

ప్రజాశక్తి-బాపట్ల

మండలంలోని చెరువు జమ్ములపాలెంలో దూసరి సుభాషిణిపై పెట్రోల్ పోసి హత్య చేసిన ఘటనలో నిందితుడైన మృతురాలి భర్త దూసరి హరీష్ అలియాస్ దాసును అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసు స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. చెరువు జమ్ములపాలెంకు చెందిన దూసరి సుభాషిణితో 12ఏళ్ల క్రితం దూసరి హరీష్‌కు వివాహమైంది. వారికి పదేళ్ల తారక్, ఎనిమిదేళ్ల సాత్విక్ కుమారులు ఉన్నారు. హరీష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సుభాషిణి కూలి పనులకు వెళ్తుంటుంది. హరీష్ చాలా కాలంగా భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. ఈనెల సుభాషిని ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతుందని అనుమానించిన హరీష్ ఈ నెల 9న తన భార్యతో గొడవపడ్డాడు. అనుమానంతో మంచంపై పడుకున్న తన భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో సోమవారం సాయంత్రం ఆమె మృతి చెందారు. మృతురాలి తల్లి గుజ్జర్లపూడి మేరిమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు హరీష్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ ఐ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీనియర్ యుటిఎఫ్ నాయకులు నెమిలయ్య మృతి

ప్రజాశక్తి-పొదిలి

నెమిలయ్య (ఫైల్)

సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కొంకల నెమిలయ్య(82) బుధవారం వయోభారంతో మృతి చెందారు. పొదిలి పట్టణంలోని బ్యాంక్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఆయన పరమపదించారు. ఆయన కొనకనమిట్ల మండలం పెదారికట్ల, సిద్దవరం ఆర్.సి.యం స్కూల్‌లలో ఉపాధ్యాయునిగా పని చేసి 2001లో రిటైర్డ్ అయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు లక్ష్మీ నారాయణ కొత్తపట్నం మండలం ఈతముక్కలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ యుటిఎఫ్‌లో జిల్లా కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండవ కుమారుడు రామ్మోహన్ నాబార్డ్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. నెమిలయ్య సర్వీసు మొత్తం యూటీఎఫ్ సభ్యునిగా, సీనియర్ కార్యకర్తగా ఉన్నారు. నెమిలయ్య మరణ వార్త తెలిసి బుధవారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. నెమలయ్యకు నివాళులర్పించిన వారిలో జనసేన నాయకులు వరికూటి నాగరాజు, టిడిపి నాయకులు ఆవులూరి యలమంద, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

కొత్తపట్నం తహశీల్దార్‌గా శాంతి

ప్రజాశక్తి-కొత్తపట్నం

తహశీల్దార్ శాంతి

కొత్తపట్నం నూతన తహశీల్దార్‌గా కె.శాంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్టిఫికెట్లు పెండింగ్ లేకుండా చూస్తానని, అవకాశం ఉన్న వరకు అర్జీదారుని సమస్య వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాండ్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. తహశీల్దార్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మద్దిపాడు తహశీల్దార్‌గా ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు తహశీల్దార్‌గా వేమూరి ఆదిలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె సంతనూతలపాడు తహశీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహశీల్దార్‌ను రేషన్ డీలర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజయ్ రెడ్డి, రీసర్వే డిటి రఫీ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, టైపిస్టు ఉన్నారు.

భూవివాదాలకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలో నెలకొన్న భూవివాదాలకు పరిష్కారం చూపాలని టిడిపి నాయకులు కోరారు. తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నాగుల మీరాను బుధవారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఏవైనా భూ సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుందురు నారాయణరెడ్డి, గాయం తిరుపతి రెడ్డి, కోటపాటి శేషయ్య, దొడ్డిచింతల సర్పంచి సానికొమ్ము బ్రహ్మారెడ్డి, మువ్వా రంగ సాయి యాదవ్, రెడ్డం తిరుపతిరెడ్డి, గంగిరెడ్డి రమేష్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బలసాని కోటయ్య, గాయం సుబ్బయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తాతపూడి బుజ్జి, మల్లెల వెంకటేశ్వర్ రెడ్డి, అన్నపురెడ్డి జనార్దన్ రెడ్డి, తెలుగు మహిళా నాయకులు శివమ్మ, కుడాలి దశరథ, ముక్కు శ్రీనివాసులు రెడ్డి, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొండపి

ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని తహశీల్దారు శీలం శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. బుధవారం నూతన తహశీల్దారు శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సచివాలయాల్లో విఆర్‌వోలు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చాలని అన్నారు. సచివాలయాలలోని ప్రజలు వారి సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయానికి రాకుండా ఆయా సచివాలయాల్లోనే పరిష్కరించాలన్నారు. తహశీల్దారుకు సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు.

ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బంది తమ విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని ఆ పథకం ఏపీఓ శ్రీనివాసనాయక్ తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఏలు, ఎఫ్ఏలు తమకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో మొక్కల పెంపకానికి సంబంధించి రైతులను గుర్తించి, వారు మొక్కలు నాటుకునే విధంగా పనిచేయాలన్నారు.

జగన్‌ను కలిసిన ఉడుముల వరలక్ష్మమ్మ

ప్రజాశక్తి-పొదిలి

గిట్టుబాటు ధర లభించక అల్లాడిపోతున్న పొగాకు రైతులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక పొగాకు బోర్డును సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉడుముల వరలక్ష్మమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-కొత్తపట్నం

గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. కొత్తపట్నం మండలంలోని రంగాయపాలెంలో సీసీ రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నిధులతో రూ.7.4 కోట్లు అంచనాలతో 280 పనులు చేపట్టారు. వీటిలో పనులు మొత్తం పూర్తి అయిన సందర్భంగా బుధవారం రంగాయపాలెంలో సిసి రోడ్లను బుధవారం ప్రారంభించారు. పాదర్తి, రంగాయపాలెం. కొత్తపట్నం, కె.పల్లెపాలెం గ్రామాల్లో స్పౌజ్ కేటగిరీ క్రింద నూతనంగా మంజూరైన పింఛన్లను 17 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో వేణు, తహశీల్దార్ పి.శాంతి, పిఆర్ ఏఈ రాంకుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఎడి ఫిషరీస్, మండల నాయకులు శ్రీనివాసులు రెడ్డి, బలగాని వెంకటేశ్వర్లు, రాఘవరెడ్డి, మూగ పోలిరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

అమరావతి మహిళలను అవమానించిన వారిపై

వెంటనే చర్యలు తీసుకోవాలి

నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

అమరావతి మహిళలపై అసభ్యకరం గా మాట్లాడిన కృష్ణంరాజు, సజ్జల రామకృష్ణారెడ్డి, సాక్షి సీనియర్ రిపోర్టర్ కొమ్మినేని శ్రీనివాస్‌పై చర్యలు వెంటనే తీసుకోవాలని మార్కాపురం శాసనసభ్యు లు కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్, తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతుల మహిళలు వేశ్యలు అనటం బాధాకరమన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మహిళలు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగన్ పొదిలి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి విచ్చేయటం బాధాకరమన్నారు. దర్శి నుంచి పొదిలి పెద్ద చెరువుకు నీటిని సరఫరా చేసే నందుకా? వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి నీటిని అందించినందుకా? ఏమి చేశారని, ఎందుకు వస్తున్నారో జగన్ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని ఖండించకపోవడం బాధాకరమన్నారు. ఇక్కడ మహిళల ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని, ఆయన ఏ మొహం పెట్టుకొని పొదిలికి ఇచ్చారో తెలపాలని దుయ్యబట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ ముల్లా మహమ్మద్‌కు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ మోరబోయిన బాబూరావుయాదవ్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి రామస్వామి రామిరెడ్డి, వెలుగొండ ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ కుందూరు కాశిరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జవాజి బాషాపతినాయుడు, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, మండల టిడిపి మాజీ కన్వీనర్లు తాతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కనకము నరసింహారావు, మండల మాజీ ఎస్సీసెల్ కోనంకి సాల్మన్, నాయకులు పండిడి తిమోతి, ముక్కాల శ్రీనివాసరెడ్డి, వేంపాటి శ్రీకాంత్‌రెడ్డి, ఎం.నరసింహారెడ్డి, భీమాంజనేయరెడ్డి, వెల్లుల తిరుపతయ్య, దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పరిటాల సుబ్బయ్య, ఎం.చెన్నారెడ్డి, అంజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పుల్లమ్మ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కొండపి

ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కట్టవారిపాలెం, గోగినేనివారిపాలెం గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతాలలో పర్యటించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మూడు నెలల నుండి తమకు వేతనాలు రాలేదని మేము ఎలా బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీ మస్తాన్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం పని చేసిన 15 రోజులు వేతనాలు ఇవ్వాలన్నారు. ఆలస్యమైతే వడ్డీతో కలిపి వేతనాలు ఇవ్వాలని చట్టం చెబుతుందని, కష్టజీవులు పట్ల పాలకులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఉపాధి కూలీలకు ప్రత్యేకంగా సమ్మర్ అలవెన్సులు ఇచ్చే వారిని అటువంటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాములు, సుజాత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న గ్రామీణ కార్మికులకు గత పది సంవత్సరాల కాలంలో ఒక్క పని ముట్టు కూడా ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. హనుమంతునిపాడు మండలంలోని ముప్పల్లపాడు గ్రామంలో ఉపాధి కూలీలు పని ప్రదేశంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిముట్లు ఇవ్వకుండా పని ఎలా చేయాలని ప్రశ్నించారు. గతంలో పనిముట్లు పంపిణీ చేయడం వలన కూలీలు పని మెజర్మెంట్స్ తగ్గకుండా పని చేశారని తెలిపారు. గత మూడు నెలల కాలంలో ఒక్క బిల్లు కూడా నేటికీ చెల్లించలేదని, తక్షణమే ఉపాధి పెండింగ్ బిల్లులను విడుదల చేసి కూలీలకు అకౌంట్లో డబ్బులు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేకల గురుస్వామి, సూరెడ్డి వెంకటరెడ్డి, మోషే, ఇజ్రాయిల్, కొండయ్య పాల్గొన్నారు.

మద్దిపాడు: ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని దొడ్డవరప్పాడులో బుధవారం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దాదాపు రెండు నెలల నుంచి డబ్బులు పడలేదని కూలీలు చెబుతున్నారని అన్నారు. అనంతరం కూలీలు వెంటనే బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు.

కూలీలతో మాట్లాడుతున్న కేజీ మస్తాన్

నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

విజయభాస్కర్‌కు సిఐటియు నాయకుల నివాళి

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

మండలంలోని ఆనికలపల్లి అంగన్‌వాడీ హెల్పర్ బిజ్జముల విజయలక్ష్మి భర్త విజయ భాస్కర్ (38) బుధవారం తెల్లవారుజాము గుండెపోటుతో మృతి చెందారు. సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య బుధవారం ఆనికలపల్లిలో విజయ భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సిఎస్‌పురం మండల సిఐటియు నాయకులు ఎస్.తిరుపతిరెడ్డి, అంగన్వాడీ ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు సిహెచ్ రఫియా, ఆనికలపల్లి అంగన్వాడి టీచర్ సహనాజ్ బేగం, డిజేపేట అంగన్‌వాడీ హెల్పర్ ఇండ్ల అంకమ్మ, ఉపాధ్యాయులు రమణారెడ్డి, పాదుషా, ఆర్ఎంపీ డాక్టర్ ఎస్.కె రెహమాన్, రైతు సంఘం మండల నాయకులు అజీజ్ భాష, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.ఏసుదాసు, తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

సిఐటియు నాయకులు రాయళ్ల మాలకొండయ్య

ప్రజాశక్తి-వెలిగండ్ల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రకాశం జిల్లా సిఐటియు నాయకులు రాయళ్ల మాలకొండయ్య ప్రభుత్వాన్ని కోరారు. వెలిగండ్ల మండల కేంద్రంలో బుధవారం ఎం.మాలకొండయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రూ.5,700తో కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రెడ్డం బాలాజీ, ఉపాధ్యక్షులుగా ఎం.మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శిగా చింతకాయల వీరనారాయణ, సహాయ కార్యదర్శిగా తాళ్లూరి మాల్యాద్రి, కమిటీ సభ్యులుగా ఉప్పుటూరి తిరుపతయ్యలను ఎన్నుకున్నారు.

13 వరకు ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలో 13 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ తీసుకుని పదేళ్ల దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్, వయసు, పేరు మార్పు, ఫోన్ నెంబరు అప్‌డేట్, ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ కార్డులు జారీ వంటి సేవలను అందించనున్నట్లు తెలిపారు.

224 బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 224 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కోయవారిపాలెం, ధర్మవరం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకట కృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 844 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. 620బేళ్లు కొనుగోలు కాగా వివిధ కారణాలతో 224 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.180, సరాసరి ధర కేజీ రూ.249.24 గా నమోదయింది.

భక్తుల విశ్వాసానికి ప్రతీక..

కామేపల్లి పోలేరమ్మ

కామేపల్లిలోని పోలేరమ్మ తల్లి ఆలయం

కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి

ప్రారంభమైన వార్షిక తిరునాళ్లు

ఆలయంలో భక్తుల పూజలు

ప్రజాశక్తి-టంగుటూరు

కామేపల్లి పోలేరమ్మ తల్లి కొంగుబంగారంగా భాసిల్లు తోంది. పోలేరమ్మకు మొక్కుకుంటే ఎలాంటి కోరికలైనా తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు. ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో వెలిసిన పోలేరమ్మ తల్లి గ్రామదేవత కొండపి, కందుకూరు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాలతో పాటు ప్రకాశం జిల్లాలోని వేలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది.

అంచెలంచెలుగా ఆలయ అభివృద్ధి..

జరుగుమల్లి మండలంలోని కామేపల్లి పొలిమేర ప్రాంతంలో కామేపల్లి, రావులకొల్లు రహదారిలోని పొలాల్లో 1910-20 ప్రాంతంలో బీడు భూముల్లో కొన్ని శిలలను స్థానికులు గుర్తించారు. తొలుత ఈ శిలలకు అక్కడే పూజలు నిర్వహించేవారు. తరువాత కొద్ది కాలానికి రావులకొల్లు సమీపంలోని చాగంటి రోశప్ప నాయుడుకి చెందిన పొలంలో ఈ శిలలను తెచ్చి, అక్కడే ప్రతిష్టించి చిన్నపాటి గుడిని నిర్మించారు. అప్పట్లో కామేపల్లి గ్రామస్థులకు అధిక శాతం మంది ప్రజలకు ఆటలమ్మ, తడపర, దద్దు వంటి చర్మ వ్యాధులు సోకింది. కొంత మంది పోలేరమ్మకు మొక్కుకొని వ్యాధి నయమవడంతో మొక్కులు తీర్చుకున్నారు. అప్పటి నుంచి ఇది ఆచారంగా కొనసాగింది. భక్తుల కోర్కెలు తీరడంతో స్థానికులు కాలక్రమేణా శిలల స్థానంలో విగ్రహాలు ప్రతిష్టించి ధ్వజస్థంభం ఏర్పాటు చేసి ఆలయాన్ని కూడా కట్టించారు. అప్పటి నుంచి పోలేరమ్మ తల్లి దేవస్థానం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. అప్పటి నుంచి పోలేరమ్మకు క్రమం తప్పకుండా పూజలు నిర్వహిస్తున్నారు.

పోలేరమ్మకు మొక్కే పనులు ప్రారంభం

స్థానిక ప్రజలతో పాటు జరుగుమల్లి, టంగుటూరు, పొన్నలూరు, శింగరాయకొండ, కొండపి మండలాలు కనిగిరి, కందుకూరు నియోజకవర్గాలలోని ప్రజలు ఏ పనిని ప్రారంభించాలన్నా పోలేరమ్మ తల్లిని దర్శించుకుంటారు. తల్లిని స్మరించుకొని ప్రారంభిస్తే పని విజయవంతంగా పూర్తవుతుందని విశ్వాసం.

భక్తుల విశ్వాసానికి ఉదాహరణలు..

సుమారు 45 ఏళ్ల క్రితం జరుగుమల్లి మండలం వర్ధినేనివారిపాలెంనకు చెందిన ఒక వర్తకుని ఇంట్లో దొంగలు పడి బంగారం దోచుకెళ్ళారు. వీటి విలువ అప్పట్లో లక్షకుపైనే ఉంటుంది. బంగారం పోగొట్టకున్న ఆ కుటుంబ సభ్యులు తీవ్రంగా కలత చెందారు. స్థానికుల సూచనల మేరకు వారు పోలేరమ్మ తల్లి గుడి వద్దకు వచ్చి పూజలు నిర్వహించారు. ఇది జరిగిన మూడో రోజు రాత్రి బంగారు నగలు ఆ వర్తకుని ఇంటి ముందు నీటి తొట్లో లభించినట్లు ఒక ప్రచారం ఉంది. దీంతో పాటు కామేపల్లి, కట్టుబడివారిపాలెం, కొండపి, రావులకొల్లు, పొన్నలూరు, కందుకూరు తదితర గ్రామాలకు చెందిన వారి గృహాల్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైతే పోలేరమ్మ తల్లికి మొక్కుకున్న వెంటనే తిరిగి లభించడంతో భక్తులకు అమ్మవారిపై నమ్మకం పెరిగినట్లు స్థానికులు చెబుతారు. మరో విశేషమేమంటే కామేపల్లి పరిసర ప్రాంతాల్లో మద్యానికి బానిసలైన వేలాది మంది పోలేరమ్మ గుడిని దర్శించి కంకణం ధరిస్తే తిరిగి మద్యం జోలికి పోరని ఒక ప్రచారం ఉంది. అనేక మంది మహిళలు మద్యానికి బానిసలైన తమ భర్తలను, బంధువులను గుడికి కంకణం ధరించగా పూర్తిగా మద్యం మానుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సంతానం లేనివారు, ఇతర కుటుంబ సమస్యలు ఉన్న వారు పోలేరమ్మకు మెక్కుకుంటే సమస్యలు పరిష్కారమయినట్లు ప్రచారం ఉంది.


పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

ప్రారంభమైన తిరునాళ్ల

కామేపల్లి పోలేరమ్మ వార్షిక తిరుణాళ్ల ప్రారంభమైంది. బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విచిత్ర వేషాలు, కేరళ బృందంచే ప్రత్యేక వాయిద్యాలు, తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. 12వ తేదీ గురువారం ఉదయం విశేష అలంకరణ, రాత్రికి విద్యుత్ ప్రభలు, భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. రాత్రి 6 గంటలకు కామేపల్లిలోని సహస్ర ఉన్నత పాఠశాల విద్యార్థులచే భరత నాట్యం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు జెట్టి పద్మ చౌదరి బృందంచే కోలాటం, 11 గంటలకు భక్త చింతామణి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 13వ తేదీ శుక్రవారం ఉదయం పాల పొంగళ్లుతో తిరునాళ్ల ముగుస్తుందని దేవాలయ ఈవో బైరాగి చౌదరి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

ప్రజాశక్తి-టంగుటూరు

ఏలూరి రాంబాబు

కామేపల్లి పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని గ్రామానికి చెందిన మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు తెలిపారు. పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో ఈ పాటికే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కామేపల్లిని టూరిస్టు కేంద్రంగా రూపుదిద్దేందుకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మర్రిటైం బోర్డు చైర్మెన్ దామచర్ల సత్యా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డిల సహకారంతో కృషి చేస్తామన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మంత్రి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పట్టణ స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు సర్పంచి సహకారంతో కృషి చేస్తామన్నారు. తాగునీటి వసతి, వీధుల్లో ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేస్తామన్నారు. ఫైబర్ కేబుల్ వ్యవస్థ ద్వారా గ్రామం నుంచి పోలేరమ్మ దేవస్థానం వరకు విద్యుత్ వసతి కల్పించినట్లు తెలిపారు. ఆలయం వరకు డివైడర్లను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆర్ఒ ప్లాంటు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భవిష్యత్తులో దేవస్థానాన్ని మోడల్ ఆలయంగా రూపు దిద్దేందుకు తామంతా కృషి చేస్తామని ఏలూరి రాంబాబు తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పోలేరమ్మ అమ్మవారు

మండలంలోని వాగుమడుగులో కొలువైన పోలేరమ్మ దేవత తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎండ తగలకుండా ప్రత్యేకంగా సామియాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచే అమ్మవారి దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులు తీరారు. దీంతో రద్దీ ఏర్పడింది. ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమి రోజున ఈ తిరునాళ్ల జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఏరువాక రోజున వచ్చే తిరునాళ్ల కావటంతో అమ్మవారిని ఏరువాక పోలేరమ్మ తల్లిగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాత్రికి 7 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభలపై పాట కచేరీలు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పొదిలి సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

మత సామరస్యానికి ప్రతీక

ప్రజాశక్తి-టంగుటూరు

మత సామరస్యానికి, మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రతీకగా నిలిచారు. అన్ని మతాలు సమానమని, అన్ని మతాలను గౌరవించాలంటారాయన. ఆయన పేరు షేక్ అమీర్‌బాషా. పుట్టి పెరిగింది జరుగుమల్లి మండలంలోని కామేపల్లిలోనే. పూర్తి గ్రామీణ నేపథ్యంలో పెరిగిన ఆయన స్థానికంగా నిర్వహించే పలు కార్యక్రమాలకు హాజరుకావడం ఆయన నైజం. వందేళ్ల క్రిందట వెలసిన కామేపల్లిలోని పోలేరమ్మ ఆల యాన్ని ప్రతి సందర్భంలో తన మిత్రులతో కలిసి దర్శించడం చిన్నతనం నుంచే అలవడిందంటారు. ప్రతియేటా నిర్వహించే ఉత్సవాల్ల ఆయన పాల్గొంటారు. సుమారు 25 ఏళ్ల కిందట బిల్డర్‌గా హైదరాబాదులో స్థిరపడిన ఆయన ఏదైనా కొత్త వాహనాన్ని కొనుగోలు చేసినా, కొత్త పని తలపెట్టినా పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించడం ఆనవాయితీ. తాను అనుకున్న కోర్కెలు తీర్చి ఆశీస్సులు అందిస్తున్న తల్లిగా ఆయన విశ్వసిస్తున్నట్లు బాషా ప్రజాశక్తికి తెలిపారు. 2012లో తనకు ఆర్థిక పరిస్థితి సహకరిం చకున్నప్పటికీ తాను విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశానని తెలిపారు. అదే ఆనవాయితీని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమీర్ బాషా ధర్మపత్ని మనీషా బాషా ప్రస్తుతం కామేపల్లి సర్పంచిగా సేవలందిస్తున్నారు.

షేక్ అమీర్ బాషా దంపతులు

నవోదయ, సైనిక స్కూల్‌కి ఉచిత కోచింగ్

ప్రజాశక్తి-పీసీపల్లి: నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు కనిగిరి కేటీసీ విద్యా సంస్థ నిర్వాహకులు పాపారాయుడు తెలిపారు. కేటీసీ విద్యా సంస్థ స్థాపించి పది సంవత్సరాల అయిన సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని విద్యార్థులకు ఈనెల 15, 22, 29, జూలై 6, తేదీల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఈ టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ కనపర్చిన వారికి ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. 6303423028 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండలోని శ్రీ వరహాలక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్ల భాగంగా బుధవారం నాడు శ్రీ కష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రాధాడు పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆ గ్రామ ఉపసర్పంచ్ నక్క బ్రహ్మేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు సవిడి బోయిన మురళి ప్రారంభించారు. ఈ రాష్ట్ర స్థాయి రాధాడు పోటీలకు రాష్ట్రంలోని నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కర్నూలు జిల్లాల నుంచి 15 జతలు ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. రాత్రి సమయం అయినప్పటికీ ఈ రాధాలు పోటీలు హోరాహోరీగా కొనసాగుతూనే ఉన్నాయి. ఎస్సై బి.మహేంద్ర ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బండను లాగుతున్న ఎద్దులు

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- డబుల్ ఇంజన్ సర్కార్లకు రైతన్నల పట్ల నిర్లక్ష్యధోరణి
- దేశంలో రుణ విమోచన పథకాన్ని అమలు చేయాలి
- వ్యవసాయ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి
- ఏరువాక పౌర్ణమి రైతు సదస్సులో శోభనాద్రీశ్వరరావు

మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రైతాంగం ఐక్యంగా పోరాడినప్పుడే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా అభివద్ధికి వేదిక ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వడ్డే శోభనాధీశ్వరరావు మాట్లాడుతూ పాలకులు రైతన్నలను కులాల పేరుతో, మతాల పేరుతో, రాజకీయ పార్టీల పేరుతో, ప్రాంతాల పేరుతో విడగొట్టి సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. రైతు నాయకుల పేరుతో కొందరు దళారులు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాల ద్వారానే బర్లీ పొగాకు రైతులు కంపెనీల చేత, ప్రభుత్వం చేత పొగాకు కొనుగోలు చేసేలా సాధించుకున్నారని గుర్తు చేశారు. డబుల్ ఇంజన్ సర్కారు పాలనలో రైతన్నల పట్ల నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోందన్నారు. విదేశాలలో పరిశ్రమలతో పాటుగా వ్యవసాయానికి తగు ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్లో ఏ పంటకూ కూడా గిట్టుబాటు ధర లేదన్నారు. మిర్చి, పొగాకు, వరి, కంది, శనగ, పత్తి వంటి ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అన్నం పెట్టే రైతన్నలకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, వేలకోట్లలో రుణాలు పొంది ఎగ్గొట్టి.. దేశం వీడి పారిపోతున్న కార్పొరేట్ శక్తులకు మాత్రం బ్యాంకులు దేశ ప్రజల సొమ్మును దోచిపెడుతున్నాయని విమర్శించారు. మరో ముఖ్యఅతిథి వ్యవసాయ విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతాంగ సమస్యలకు ప్రకాశం జిల్లా రైతాంగం దిక్సూచిగా నిలవాలని సూచించారు. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పంటల బీమా పథకం రైతాంగ సొమ్మును బీమా సంస్థలకు దోచిపెట్టడానికి తప్ప, రైతాంగానికి ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సబ్సిడీతో అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రైతు నాయకులు పరిటాల కోటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరి నాంచార్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, రెడ్ స్టార్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమవరపు సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్‌రావు, ఏపీ రైతు సంఘం నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, జిల్లాకు చెందిన పలు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

జగన్ పర్యటన భగ్నం చేసేందుకే టీడీపీ దాడులు

మీడియా సమావేశంలో వైసీపీ నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు రైతులకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మెహన్‌రెడ్డి పొదిలిలో చేపట్టిన రైతు పోరుబాట కార్యక్రమం విజయవంతమైందని ఆ పార్టీ నాయకులు బుధవారం సాయంత్రం ప్రకటించారు. జగన్ పర్యటన భగ్నం చేసేందుకే టీడీపీ దాడులకు పాల్పడిందని ఆరోపించారు. ఒంగోలులోని జిల్లా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ శాసన సభ్యులు అన్నా వెంకట రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబుతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పొదిలిలో జగనన్న పోరుబాట పర్యటన విజయవంతం అయిందని, సుమారు యాభై, అరవై వేల మంది రైతులు తరలివచ్చారని, కార్యక్రమం విజయవంతం చేసిన రైతులు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. జగన్ పర్యటనను భగ్నం చేసేందుకు టిడిపి నాయకులు చేసిన దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిరసన ముసుగులో మహిళలను అడ్డు పెట్టుకుని నాలుగైదు చోట్ల చెప్పులు, రాళ్ళతో దాడులకు తెగబడవలసిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు? ఈ దాడుల్లో పోలీసులు, తమ కార్యకర్తలు గాయపడ్డారని పేర్కొన్నారు. మహిళల ముసుగులో నీచమైన రాజకీయాలు చేయడం హేయమైన చర్యగా విమర్శించారు. దాడులకు పాల్పడిన వారిపై,వారిని ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ శాసన సభ్యులు అన్నా రాంబాబు మాట్లాడుతూ నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, నిరసన పేరుతో విధ్వంసం సష్టించడానికి మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఉద్దేశపూర్వకంగానే హింసకు పురికొల్పినట్లు ఆరోపించారు. కార్యక్రమం భగ్నం గావించేందుకు అర్ధరాత్రి పొదిలిలో ఉన్నారని, సిసి పుటేజి పరిశీలిస్తే వెల్లడవుతుందన్నారు. పోలీసుల లాఠీఛార్జీని తాము తప్పు పట్టడం లేదన్నారు. చుండూరు రవిబాబు మాట్లాడుతూ ముసుగులో రాజకీయాలు చేయడం అప్రజాస్వామికమన్నారు. దాడుల సంస్కతిని ప్రోత్సహించడం టీడీపీ కార్యకర్తలకు తగదని హితవు పలికారు. సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కెవి.రమణారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజీవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ, చెంచిరెడ్డి, మన్నం శ్రీధర్, కష్ణారెడ్డి, కోటిరెడ్డి, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

మంత్రులకు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన హామీలు, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కమిటీ నేతలు కోరారు. ఒంగోలు త్రోవగుంట పొగాకు కేంద్రంలో ఏరువాక పూర్ణిమలో పాల్గొన్న మంత్రులను ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్య అపరిష్కృతంగా ఉందని, ప్రభుత్వం 3 సెంట్లు ఇస్తామని, గతంలో జీవో జారీ చేసిందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె చినకరిముల్లా, దాసరి సునీల్, జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు, పి9 టివి మేనేజింగ్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, ఎల్.రాజు పాల్గొన్నారు.

మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అయేషా బేగం

'ఎక్సైజ్' జిల్లా ఆఫీసర్‌గా అయేషాబేగం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా షేక్ అయేషాబేగం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణాల నిర్వాహకులు ఎక్సైజ్ రూల్స్-2024ను అనుసరించి, సమయ పాలన పాటించాలన్నారు. జిల్లాలోని 188 మద్యం షాపులు ఉదయం 10 గంటలకు తెర వాలని, రాత్రి 10 గంటలకు మూసివేయాలని, 23 రెస్టారెంట్ అండ్ బార్లను ఉదయం 11 గంటలకు తెరవాలని, రాత్రి 11 గంటలకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏమైనా నిబంధనలు అతిక్రమిస్తే ఎక్సైజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆమె తూర్పునాయుడు పాలెంలో మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లు మూత

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆర్టీసీ బస్‌పాస్‌లు ఐడి మార్చే ప్రక్రియలో భాగంగా ఈ నెల 12,13 తేదీల్లో రెండు రోజులు పాటు ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్లు మూసి వేయనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి సత్యనారాయణ బుధవారం నాడు ఒక ప్రకటన లో తెలిపారు. కొత్త బస్సు పాసులు 14 నుండి యధావిధిగా జారీ చేస్తామన్నారు.

'పోరుబాట'కు పోటెత్తిన జనం

- పొగాకు రైతుల సమస్యలు తెలుసుకున్న మాజీ సిఎం జగన్
- కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ టిడిపి నిరసన కార్యక్రమం..
- చెప్పులు, రాళ్లతో పరస్పర దాడులు
- కానిస్టేబుల్ సహా నలుగురికి గాయాలు

మీడియాతో మాట్లాడుతున్న వైఎస్.జగన్

ప్రజాశక్తి-పొదిలి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పొగాకు రైతులకు మద్దతుగా బుధవారం పొదిలికి విచ్చేశారు. జగనన్న పోరుబాట కార్యక్రమానికి ప్రజలు పోటెత్తారు. అనుకున్న సమయానికి పొదిలి పట్టణంలోని దర్శి రోడ్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుండి రోడ్డు మార్గంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ర్యాలీ బయలుదేరింది. శివాలయం సెంటర్ నుండి రథం రోడ్డు మీదుగా పెద్ద బస్టాండ్ సెంటర్ నుండి పొగాకు వేలం కేంద్రం వరకు ర్యాలీ సాగింది.

మార్గమధ్యలో రథం రోడ్‌లో టిడిపి నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి అమరావతి మహిళా రైతులపై సాక్షి జర్నలిస్టు వ్యాఖ్యలకు నిరసనగా నల్ల బెలూన్లు, ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. కొందరు టిడిపి నాయకులు 11 సీట్లు వచ్చిన జగన్ 11వ తేదీన పొదిలికి రావడం.. మీకు పదకొండేనా.? అంటూ హేళన చేస్తూ నినాదాలు చేయడంతో రెండు గ్రూపుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఒక మందుబాబు చెప్పు విసరడంతో అది నేరుగా దర్శి డి.ఎస్.పి లక్ష్మీనారాయణ తలపై పడింది. వెంటనే స్పందించిన పోలీసులు సదరు మందబాబుకు దేహశుద్ధి చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ర్యాలీ పెద్ద బస్టాండ్ మీదుగా పొగాకు వేలం కేంద్రానికి వెళ్తుండగా పెద్ద మసీదు ఉన్న టిడిపి కార్యకర్తలు నాయకులు మరోసారి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ, టిడిపి నాయకుల మధ్య వాగ్వివాదంతో తోపులాట జరిగింది. ఆ వెంటనే కొందరు చెప్పులు, రాళ్లతో దాడులు చేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న కంభం పోలీస్ స్టేషన్‌కు చెందిన రత్నం అనే కానిస్టేబుల్ తలకు గాయాలయ్యాయి. మరో ముగ్గురికి కూడా దెబ్బలు తగిలాయి. పరిస్థితి అదుపుతప్పి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జి చేసి జనాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా పలువురికి గాయాలయ్యాయి. రాళ్ల దాడిలో గాయపడిన వారిని పోలీసులు స్థానిక వైద్యశాలకు తరలించారు.

జగన్మోహన్‌రెడ్డి ర్యాలీ పోలీస్ స్టేషన్ మీదుగా పొగాకు వేలం కేంద్రానికి చేరుకుంది. జగన్ అక్కడ రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. వేలం కేంద్రంలో పొగాకు ధరలను, రైతుల స్థితిగతులను విచారించారు. పొగాకు గిట్టుబాటు ధర కోసం, రైతుల కోసం ఎంతకైనా పోరాడతానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం వేలం కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన భారీ జన సందోహం మధ్య విజయవంతంగా ముగిసింది. జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు చుండూరు రవి, దద్దాల నారాయణ, ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, వై.యం ప్రసాద్ రెడ్డి, సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు వేలం పరిశీలిస్తున్న జగన్

ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025

నూరుశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యద్దనపూడి

హెచ్‌ఎం రాఘవేంద్రరెడ్డి

మండలంలోని అనంతవరం కెవివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983లో ప్రారంభించారు. అనంతవరం, సూరవరపల్లి, వింజనంపాడు, గుదేవారి పల్లె గ్రామాల విద్యార్థులు పాఠశాల్లో చదువుకుంటున్నారని ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్రరెడ్డి తెలిపారు. వేసవి సెలవుల అనంతరం గురువారం నుండి పాఠశాల పునః ప్రారంభం అవుతుందని తెలిపారు. పూర్వ విద్యార్థులు దాతల సహకారంతో పాఠశాలకు కంప్యూటర్లు, వాటర్ ప్లాంట్, వింజనపాడు విద్యార్థులకు దాతల సహకారంతో పాఠశాలకు రాకపోకలకు ఆటో కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిసి కెమెరాలు, కళా ప్రాంగణం, వంటగది, సైకిల్ షెడ్లు, సరస్వతి దేవి విగ్రహం, భోజన శాల, లైబ్రరీ, విద్యార్థులకు బెంచీలు దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు గత మూడేళ్ల నుండి 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు తెలిపారు. 2024 –25 విద్యా సంవత్సరంలో 30మంది 10వ తరగతి విద్యార్థుల్లో 29 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. విద్యతో పాటు కంప్యూటర్ విద్య ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు.

పొలం దున్నుతున్న తహశీల్దారు బ్రహ్మయ్య

పంటలు సమృద్ధిగా పండాలి

ప్రజాశక్తి - పర్చూరు

రైతుల పంటలు సమృద్ధిగా పండాలని తహశీల్దారు బ్రహ్మయ్య ఆకాంక్షించారు. తహశీల్దారు కార్యాలయం ఆవరణలో పొలంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా తహశీల్దారు ఎడ్లతోనాగలి దున్నారు. అంతకు ముందు భూమి పూజ చేసి నాగలి వద్ద కొబ్బరికాయ కొట్టి ఏరువాక సందర్భంగా పనులు ప్రారంభించారు. ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామాలకు చెందిన రైతుల ఎడ్లు, నాగళ్ళతో భూమిని దున్నారు. ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామస్తులు దున్నిన పొలంలో విత్తనాలు చల్లారు. మంచి పంట దిగుబడులు రావాలని, రైతుల లోగిళ్ళు పంటల ఉత్పత్తితో నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి కె సత్యనారాయణ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించడంతోపాటు ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బుధవారం బాపట్ల విచ్చేసిన ఎపిఎస్ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ ఎస్ సురేష్ రెడ్డికి ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మున్నంగి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని అన్నారు. చీరాల, బాపట్ల డిపోల్లో తగినంత మంది సెక్యూరిటీ సిబ్బందిని రెండు డిపోల్లో నియమించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు భోగిరెడ్డి తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

నేడు అపోలో హాస్పిటల్లో రక్తదానం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని అపోలో మల్టీ స్పెక్ట్రా హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని హాస్పిటల్ ఎండి డాక్టర్ రవికిరణ్ తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభిస్తారని తెలిపారు. రక్తదానం చేయాలని కోరారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్లలో సిఐటియు నాయకులు, కార్యకర్తల నిరసన

విశాఖ స్టీల్ ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఐదువేల మందిని తొలగించడానికి నిరసనగా సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడారు. అనేకమంది ప్రాణ త్యాగ ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును నేడు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలన్న కుట్రలో భాగంగా కార్మికులను తొలగించడం దుర్మార్గమని అన్నారు. కనీసం కార్మికులతో చర్చలు జరపకుండా, కార్మికులకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా తొలగించటం అన్యాయమని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడతామని భరోసా ఇచ్చి నేడు ఐదు వేల మంది ఉద్యోగాలు కోల్పోతున్నా ఒక్క మాట మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ వైఖరి మార్చుకొని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నుండి కాపాడాలని కోరారు. ప్రవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కార్మికులు, ప్రజా సంఘాలు కలసి రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మణిలాల్, సిహెచ్ మజుందార్, నాయకులు ఎం వసంతరావు, కె శ్రీనివాస్, టి వెంకటేశ్వర్లు, ఝాన్సీ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఓ విజయమ్మ

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ప్రతి స్కాన్ సెంటర్ యాజమాన్యం పిసిపి ఎన్‌డిటి నిబంధనలు తప్పక పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం జరిగిన పిసిపి ఎన్‌డిటి జిల్లా స్థాయి అడ్వైజరీ, సబ్ డిస్టిక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎఎన్ ఎం, ఆశా కార్యకర్తలు గర్భవతులకు అవగాహన కల్పిం చాలని అన్నారు. ఆర్ఎంపి సిఫార్సులను పరిగణలోకి తీసుకొని గర్భిణీలకు స్కానింగ్ తీయడ నేరమని అన్నారు. ఆర్ఎంపిలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని తెలిపారు. ఎలాంటి సూది మందులు, సెలైన్లు ఎక్కించరాదని అన్నారు. సెలైన్ పెట్టి వైద్యం చేసే ఆర్ఎంపిలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్ అనుమతులను ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్ చేయించు కోవాలని అన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. మొదటి గర్భం ధరించిన వారికి కాన్పు అయిన తరువాత బిడ్డకు బిడ్డకు ఎడం ఉండే విధంగా తాత్కాలిక పద్ధతులు వాడే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో గైనకాలజిస్ట్ శాంతి వైష్ణవి, పిడియాట్రిషన్ సౌధన్య, బ్రహ్మం, లలిత రాజేశ్వరి, భూషణం, ఎన్జీఓ మహమ్మద్ ఖాన్, ప్రసాద రావు, డిపిఓ ప్రేమ పావని, డిప్యూటీ డెమో బి మరియమ్మ, హెచ్ఈ అరుణ పాల్గొన్నారు.

మహిళలకు జీవనోపాధి కల్పించాలి

ప్రజాశక్తి - పర్చూరు

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణాచారి

మండలంలోని ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులకు జీవనోపాధి కల్పించాలని జిల్లా బ్యాంక్ లింకేజీ విభాగపు అధికారి ఎ లక్ష్మణాచారి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమైక్య ఈసీ సభ్యులు, గ్రామ సంఘం సహాయకురాలుకు (విఓఎ) సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘ సభ్యురాళ్లకు జీవనోపాదులు కల్పించాలని చెప్పారు. జీవనోపాదుల్లో భాగంగా ప్రతి రూపాయి తిరిగి చెల్లించే విధంగా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలని తెలిపారు. ప్రతి మండలంలో క్రెడిట్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 7 రకాల కార్యక్రమాల గురించి సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రౌండింగ్ జరిగే విధంగా చూడాలని చెప్పారు. ఇందులో సూక్ష్మ, స్థూల వ్యాపారాలు, ఎంఎంఫాం, పిఎంఈజీపి పథకాలు, పాడి గేదెల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పరిశ్రమ, గడ్డి పెంపకం, పిఎం సూర్యఘర్ ఉన్నట్లు చెప్పారు. ఈ పథకాల్లో గ్రౌండింగ్ జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత గ్రామ సంఘాల మీద ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ, సిసిలు, విఓఎలు, విఓ అధ్యక్షురాలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

ప్రజాశక్తి - అద్దంకి

మాట్లాడుతున్న ఎఓ కొర్రపాటి వెంకటకృష్ణ

నవ ధాన్యాల సాగు ద్వారా భూసారం పెంచుకోవచ్చని ఎఓ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని వెంకటాపురం, నాగులపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ కిట్స్ 10 కిలోల పరిమాణంతో 20 రకాల విత్తనాలు రైతులకు రూ.800లకు అందిస్తున్నామని తెలిపారు. ఇవి సాగు చేయడం ద్వారా 30 నుండి 40 టన్నుల జీవ ద్రవ్యం పెరుగుతుందని తెలిపారు. తద్వారా భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ సీత, ఎఇఓ కోటేశ్వరరావు, తారక రామాంజనేయులు పాల్గొన్నారు.

టైర్లు, ట్యూబులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

దివ్యాంగునికి రోటరీ సాయం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని కొంగపాడు గ్రామానికి చెందిన పేద విభిన్న ప్రతిభా వంతుడు మంగారావు నాలుగు చక్రాల మోటార్ సైకిల్ టైర్లు, ట్యూబులు పూర్తిగా అరిగి పోయి వినియోగానికి అనువుగా లేక ఇబ్బంది పడుతున్న విషయం రోటరీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్ జాగర్లమూడి శివకుమారి ఆర్థిక సౌజన్యంతో నూతన టైర్లు, ట్యూబులు మధురా నగర్ అపార్ట్మెంట్ దగ్గర మంగారావుకు బుధవారం అందచేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి,పార్వతి, తమ్మన శ్రీనివాసరావు, కృష్ణ, అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు.

స్వర్ణలో సిసి రోడ్లు ప్రారంభించిన కూటమి నాయకులు

స్వర్ణలో సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని స్వర్ణ గ్రామంలో నిర్మించిన సిసి రోడ్లను ఎన్‌డిఎ కూటమి నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీహరి మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువలకు రూ.45 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా పూర్తయిన పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నేతాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

ఎజి కాలేజిలో రక్తదానం

ప్రజాశక్తి - బాపట్ల

ఈనెల 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాలలోని హెల్త్ క్లినిక్ వద్ద కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎపిఎస్ఎసిఎస్ సౌజన్యంతో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు రక్తదాన ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి, డాక్టర్ ఎం రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎం రమాదేవి, సి సంధ్యారాణి, జి విజయ్ కుమార్, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పశువుల దాణా అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రోటరీ మిత్రుల సౌజన్యంతో స్థానిక హరి హర గోశాలకు ఐదు బస్తాల తవుడు దాణా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, శేషారెడ్డి, లక్ష్మారెడ్డి, తమ్మన శ్రీనివాసరావు, గోశాల సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న దామచర్ల, గొట్టిపాటి, కలెక్టర్

- మంత్రులు డిబివి.స్వామి, గొట్టిపాటి
- వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్
- వ్యవసాయ పరికరాల అందజేతకు రూ.146 కోట్లు
- ఏరువాక పూర్ణిమలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతులకు అన్నివేళలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ, పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బుధవారం త్రోవగుంటలో వేరువేరుగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాలలో మంత్రులు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొగాకు వేలం కేంద్రం సమీపంలోని పొలంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్, వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి వేణుగోపాల్, ప్రకాశం జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యలతో కలిసి పాల్గొన్నారు. నాగలితో పొలం దున్ని రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రులు పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. వేలం కేంద్రం-2లో పొగాకు కొనుగోలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్ ను కూడా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 20న అమలు చేసి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చుతామని మంత్రి తెలిపారు. ఫ్రీ హోల్డ్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో గతంలో జరిగిన తప్పులను ప్రభుత్వం సరిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లోగ్రేడు పొగాకును కంపెనీలు కొనుగోలు చేసేలా చూడాలని పొగాకు బోర్డు చైర్మన్ ను మంత్రి కోరారు. ఇప్పటికే మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

పొగాకు మొత్తం కొనుగోలు చేయాలి

గత రెండేళ్లుగా పొగాకు కొనుగోలుదారులు మంచి లాభాలు ఆర్జించారని, ఈ ఏడాది కూడా సాగుచేసిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రస్తుతం హై గ్రేడ్, మీడియం గ్రేడ్ పొగాకును కొనుగోలు చేస్తున్నారని, లో గ్రేడ్‌ను కూడా కొనుగోలు చేయాలని కోరారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. నల్లబర్లీ పొగాకును ఈ నెల 16 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కలెక్టర్ ఎ.తమీమ్అన్సారియా మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొగాకు కంపెనీలపై ఎమ్మెల్యే దామచర్ల ఆగ్రహం

రైతులను ఆదుకోవడంలో కంపెనీలు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. కంపెనీలు వారికి ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ కుమార్ మాట్లాడుతూ ముందుగా పొగాకు బోర్డు, ఐటిసి అవసరమైన చర్యలు తీసుకొని లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణ పాల్గొన్నారు.

వైద్యరంగం బలోపేతానికి కృషి

- మంత్రి స్వామి
- మెరుగైన సేవలందించటంపై ప్రత్యేక దృష్టి
- ఎంఎన్‌సియుని ప్రారంభించిన మంత్రి

కనిగిరిలో కంగారు మదర్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో కొత్తగా ఏర్పాటుచేసిన తల్లి నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని (ఎంఎన్‌సియు) కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో కలిసి మంత్రి బుధవారం ప్రారంభించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ కంగారు మదర్ కేర్ విధానాన్ని కనిగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలో మొదటిసారిగా అమలులోకి తెచ్చామన్నారు. కలెక్టర్ ఆలోచన, ఒంగోలు ఎమ్మెల్యే సహకారంతో ఒంగోలు జిజిహెచ్‌లో కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాల (ఎం.సి.హెచ్) లో కూడా ఇలాంటి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలను మెరుగుపరు స్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా సేవలు అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ బరువు తక్కువగా పుట్టిన బిడ్డలకు అత్యవసర వైద్య సేవలు అందించేలా, తల్లితో బిడ్డకు అవసరమైన భౌతిక సంబంధం ఉండేలా కంగారు మదర్ కేర్ విభాగాన్ని ఒంగోలు జిజిహెచ్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, డాక్టర్ ప్రభాకర్‌రావు, పరిపాలనాధికారి అద్దయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల రావు, డిప్యూటీ సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ వి.చెంచయ్య, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి. హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

కనిగిరిలోనూ ప్రారంభం

కనిగిరి: కనిగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ సెంటర్ (మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్)ను బుధవారం కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులతో కలిసి వైద్యాధికారులతో సమావేశమై ప్రజలకు వైద్యసేవలు అందించడంలో దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఈ యూనిట్‌ను ప్రారంభించుకోవడంలో ఇద్దరిని మనమంతా ప్రత్యేకంగా అభినందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆలోచన చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియాని, ఆలోచనను ఆచరణలో పెట్టిన శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని అని అన్నారు. దాతల సహకారంతో, తన సొంత నిధులు వెచ్చించి తన సొంత అమరావతి ఆసుపత్రి కన్నా మెరుగ్గా ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని ప్రత్యేకంగా ఆయన అభినందించారు. అనంతరం కనిగిరి పట్టణం లోని సమీకృత బాలికల వసతి గృహంలో 41.10 లక్షల రూపాయలతో చేపట్టిన ఆధునీకరణ పనులను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సొంత నిధులతో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరి లోని ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాలకు ముందుగా నాణ్యమైన సన్నబియ్యాన్ని అందజేశారని ఇప్పుడు ప్రభుత్వమే సన్నబియ్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మానాయక్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసనాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, యూత్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, నాగార్జున యాదవ్, తమ్మినేని సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్యే

సముద్ర వేటకు సిద్ధం!

- పూర్తికానున్న వేట నిషేధకాలం
- వలలు, బోట్లు సిద్ధం చేసుకుంటున్న గంగ పుత్రులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సముద్ర వేట నిషేధ కాలం త్వరలో ముగియనుంది. వేట నిషేధ సమయంలో నిబంధనల ప్రకారం మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల చొప్పున నగదు అందజేసింది. వేట నిషేధం వారం రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో మత్స్యకారులు సముద్రం ఒడ్డున ఉన్న బోట్లు, వలలను వేటకు సిద్ధం చేసుకుంటున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపలు గుడ్లు పెడుతున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళితే ఆ వలలు, బోట్ల వల్ల ఇబ్బందులు ఉంటాయని వేట నిషేధం పెట్టారు. వేట నిషేధం మొత్తం 61 రోజులు ఉంది.

వేటకు సిద్ధంగా ఉంచిన ఓ బోటు

సముద్రంలో ఒడ్డున ఉన్న బోట్లు, ఇంజన్లు వలలు ఇప్పటికే ఈ 61 రోజులకి కొంతమేర దెబ్బతిన్నాయి. మత్స్యకారులు బోట్లకు బాగు చేయించి.. కొత్తకొత్త రంగులు వేయించారు. ఇక బోటు ఇంజన్‌లో పరిస్థితి 61 రోజులు వాడకపోవడంతో వాటిని కూడా ఆయిల్‌తో శుద్ధి చేసుకొని సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అర్హుల జాబితాలో ఉన్న ప్రతి మత్స్యకారుడికీ రూ.20 వేల చొప్పున నగదును అందజేసింది. మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా శింగరాయకొండ మండలం, పాకల తీరం వద్దకు వచ్చి.. మత్స్యకారులకు రావలసిన నగదును అందజేశారు. మధ్యలో కొంత మంది మత్స్యకారులు తమకు నగదు పడలేదని మంత్రి స్వామికి ఫిర్యాదులు చేయటంతో మంత్రి వెంటనే స్పందించి జిల్లా అధికారులతో మాట్లాడి మత్స్యకారులకు రావలసిన నగదును ఇప్పించారు. మరో వారం రోజుల్లో మత్స్యకారుల వేట నిషేధం పూర్తికానుంది. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.